క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



జనగామ: పట్టణంలోని బాణాపురానికి చెందిన రవికి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి డీసీసీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ప్రజాపాలన విజయోత్సవాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణిమల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

- ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

జనగామ రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు అన్నారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలో శ్రీధర్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడారు. 317 జీఓ ఫలితంగా స్థానికత కోల్పోయిన అందరికీ న్యాయం చేయాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పును సరిచేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునానరు. అధ్యక్షుడిగా బి.శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా ఎ.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా జంపయ్య, ఉపాధ్యక్షురాలుగా హిమబిందు, కోశాధికారిగా మహేష్ ఎన్నికయ్యారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ వెంకన్న



జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్న బుధవారం అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ధరణిలో దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలను వారంరోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శంకరయ్య, డిటి కిషన్‌నాయక్, ఏపీఎం రవీందర్, ఆర్‌ఐ అనిల్‌బాబు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలు చేపట్టాలి

- బీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కోశాధికారి మధు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వలస కార్మికులతో స్థానిక భవన నిర్మాణ కార్మికుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయని, ఈ విషయమై స్థానిక కార్మికులు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని బీఎన్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు అన్నారు. వలస కార్మికులు పనిచేయడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని పాంనూర్ గ్రామంలో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారంతో మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని మధు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చింత జోజి, మండల అధ్యక్షుడు పండుగ రాజు, పాంనూర్ గ్రామ అధ్యక్షుడు కలకోల వెంకన్న, ఎల్లయ్య, బాబు, అనీల్, ఆదాం, రాజు, బాల్నె శ్రీను, వెంకన్న, కుమారస్వామి, నవీన్ పాల్గొన్నారు.

ట్యాంకులను శుభ్రపర్చాలి

బచ్చన్నపేట: ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నేడు (గురువారం) పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ శాఖకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీడీఓ మల్లికార్జున్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రపర్చాలన్నారు. మిషన్ భగీరథ నీటిపై గ్రామస్తులకు అవగాహన కలిగించాలన్నారు. ఆర్‌ఓ ప్లాంటు నీటిని తాగితే వచ్చే నష్టాలు, కష్టాలను కూడా వివరించాలని తెలిపారు. డీపీఓ స్వరూపారాణి ఆదేశాల మేరకు అన్ని గ్రామాలో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మూడు రోజులు పత్తి కొనుగోళ్లు బంద్

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సిరి కాటన్ ఇండస్ట్రీస్, శివ సాయి కాటన్ ఇండస్ట్రీస్‌లో పత్తి, పత్తి గింజలు నిల్వ పేరుకుపోయినందున ఈనెల 6వ తేదీన పత్తిని కొనుగోలు చేయడం లేదని మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, మార్కెట్ సెక్రటరీ జన్ను భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న శనివారం వారాంతపు సెలవు, 8న ఆదివారం సాధారణ సెలవు ఉంటాయన్నారు. దాంతో 6,7,8వ తేదీలు మూడు రోజులు సీసీఐ కొనుగోళ్లు బంద్ ఉంటుందని, విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. తిరిగి ఈనెల 9న సీసీఐ పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభిస్తారని వారు తెలిపారు.

మురుగుతో విద్యార్థుల అవస్థలు

- అధికారులు స్పందించాలని తల్లిదండ్రుల వేడుకోలు

తరిగొప్పుల: మండలంలోని కసుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మురుగు నీటితో అవస్థలు పడుతున్నారు. పాఠశాలలోని బాత్‌రూంలకు సంబంధించి మురుగు పైప్‌లు లీకేజీ కావడంతో మురుగు నీరు పాఠశాల సమీపంలో నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు నిల్వడంతో దోమల బెడద ఎక్కువవుతోందని, విద్యార్థులు రోగాల బారిన పడతారేమోనని తల్లిదండ్రులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాఠశాల సమీపంలో నిలిచిన మురుగు నీరు

అడవులతోనే మానవ మనుగడ

- రేంజ్ ఆఫీసర్ మురళీధర్

జఫర్‌గఢ్: అడవులతోనే మానవ మనుగడ.. అడవులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ రేంజ్ ఆఫీసర్ మురళీధర్ అన్నారు. అటవీ, వన్య ప్రాణాల సంరక్షణలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అడవి నుంచి వన్యప్రాణులు జనావాసాలకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా గ్రామాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వన్యప్రాణులు రాకుండా నివారించవచ్చన్నారు. రాత్రి సమయంలో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు ఎలుగుబంట్ల బారిన పడకుండా చేతిలో కర్ర, అగ్గిపెట్టె దగ్గరుంచుకొని గుంపులుగా వెళ్లాలని సూచించారు. ఎలుగుబంట్లు ఇతర జంతువులు కన్పిపిస్తే పారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ నర్సింగ్‌నాయక్, సెక్షన్ ఆఫీసర్ ఎండీ.జరీనాబేగం, బీట్ ఆఫీసర్ శిరీష, రవి, టీఏ అనిల్, వాచర్ మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేంజ్ ఆఫీసర్ మురళీధర్

విరాళం



నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతిపురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. కాగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, గ్రామస్తులు ఇటీవల పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మల్లాడి ఉపేందర్‌రెడ్డి (రిటైర్డ్ టీచర్) ఆలయాన్ని సందర్శించి రూ.50,116లు బుధవారం అందజేశారు. అనంతరం కమిటీ ఆయనను శాలువాతో సత్కరించారు. విద్యాసాగర్ రావు, సతీష్ కుమార్ శర్మ, అంజయ్య, శ్రీధర్, ఉపేందర్, శ్రీధర్, మల్లయ్య, లక్ష్మీనారాయణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు వారసత్వ ఉద్యోగాలివ్వాలి

- సంఘం రాష్ట్ర జేఏసీ నాయకుడు శివకుమార్

జనగామ రూరల్: వీఆర్‌ఏలకు వారసత్వ ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర జేఏసీ నాయకుడు చింత శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వీఆర్‌ఏలు రాష్ట్రవ్యాప్తంగా 80 రోజుల పాటు చేపట్టిన పోరాటం ఫలితంగా గత ముఖ్యమంత్రి జేఏసీతో చర్చలు జరిపి జీఓ 81, 85 విడుదల చేసినట్లు చెప్పారు. ఆ తర్వాత వీఆర్‌ఎల్లో డిగ్రీ, ఇంటర్, పదో తరగతి లోపు చదివిన 20,555 మందిని వివిధ విభాగాల్లో సర్దుబాటు చేసిందన్నారు. మిగతా 3,797 మంది వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 265 మందికి పైగా మరణించినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. ఉద్యోగాలు ఇచ్చి కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, బాలరాజు, కనకయ్య, శివ, కనకలక్ష్మి, హర్షత్, ఎల్లయ్య పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

చేతిరాతతో మంచి మార్కులు

దేవరుప్పుల: విద్యార్థులు అందమైన చేతిరాతతో పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవచ్చని ప్రముఖ చేతిరాత నిపుణుడు గుర్రం శ్రీహరి అన్నారు. బుధవార మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్‌లో అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లడానికి 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశిత కాలవ్యవధిలో విద్యార్థులు చేతిరాతపై అనుభవాన్ని పొందవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్ తోటకూర పాండు కృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ తోటకూర స్వప్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలంలోనే సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్

దేవరుప్పుల: నాలుగు దశాబ్దాల కిందట మండల కేంద్రంలోని చౌరస్తా సమీపంలో ప్రజాప్రయోజనార్థం నిర్మించిన ఆర్టీసీ బస్టాండు స్థలంలోనే మహిళల ఆత్మగౌరవం కోసం సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని అఖిల పక్షం మండల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట ప్రధాన రహదారిలోని దేవరుప్పుల మండలకేంద్రంలో ఉన్న బస్టాండ్ స్థలంలోనే సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, మండల ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సలుభ్ కాంప్లెక్సు నిధులు వేరేచోటికి మళ్లించే చర్యలకు అధికార యంత్రాంగం స్వస్తి పలుకకుంటే ఆందోళన అనివార్యమన్నారు. కాగా, కూడలి ప్రాంతంలో మహిళల కోసం సులభ్ కాంప్లెక్సు నిర్మించేందుకు అధికారులు సానుకూలతను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష నాయకులు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్, సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు జీడీ ఎల్లయ్య, వెంకట్ రెడ్డి, నర్సమ్మ, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నర్సింహ, బీజేపీ మండల అధ్యక్షుడు సత్తయ్య, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అఖిల పక్షం ప్రతినిధులు

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బుధవారం శరణం శబరీశా భక్త బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రంలోని పాత బీటుబజారు వద్ద శరణం శబరీశా భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించే అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందచేశారు. అలాగే ఈ నెల 7వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే యూత్ క్రిస్మస్ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా పల్లాను ఇంటర్‌డెనిమినేషన్ యూత్ బృందం కలిసి ఆహ్వానం అందజేసింది. కార్యక్రమంలో కార్తీక్ పాకాల, వినయ్, థామస్, సన్నీ, మనోజ్ ఉన్నారు.

వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో అద్భుత విజయాలు సాధించిందని, ప్రధానంగా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా గత ఏడాది కాలంలో పేదలకు కల్యాణలక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్నామని, ఎలాంటి అవినీతి అస్కారం లేకుండా దరఖాస్తు చేసుకున్న నెలరోజుల్లోనే చెక్కులు అందేలా పనిచేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన పూర్తయిందని, ఏడాది కాలంలో నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనులకు రూ.745 కోట్లు నిధులు తీసుకువచ్చానని, మార్చి 31 వరకు రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు చేయించే బాధ్యత తనదన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ విజయశ్రీ, ఆర్‌ఐ రవీందర్, నాయకులు శిరీష్‌రెడ్డి, సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, రజాక్‌యాదవ్, పోగుల సారంగపాణి, మంతెన ఇంద్రారెడ్డి, కొలిపాక సతీష్, కిషన్‌రాజ్, తోట సత్యం, దశరథ్‌నాయక్, జీడి రమేష్, సరిత పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి తదితరులు

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

చిల్పూరు: నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో 28 కల్యాణలక్ష్మి, 20 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ కల్వల శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పార్టీ అధ్యక్షుడు సురేష్, బాలరాజు, రంజిత్‌రెడ్డి, లింగారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, ఏదునూరి రవీందర్, జక్కుల రాజయ్య, కోల రమేష్, మూల సంపత్, సాదం సమ్మయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

పాలకుర్తి: గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. బుధవారం గూడూరులోని గిరిజన బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు. భోజనాన్ని మొదట పరిశీలించిన తర్వాత విద్యార్థులకు వడ్డించాలని ప్రిన్సిపాల్ రేణుక రాథోడ్, ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సమలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ రాకేష్‌లు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన..

మండలంలో ఎల్లరాయని తొర్రూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రోహిత్‌సింగ్ పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిల్వ చేయకుండా చూడాలన్నారు. వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ఆర్‌ఐ రాకేష్, పీఏసీఎస్ చైర్మన్ మైసిరెడ్డి, రైతులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ఘన్‌పూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆర్డీఓ డీఎస్ వెంకన్న ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణంలో భోజనాలు వండాలని, విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం సంపత్, పీడీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న రోహిత్‌సింగ్



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకన్న

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిందని ఉత్సవాలు జరుపుకునే సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఎన్నికల ముందు ప్రజలకు చేసిన హామీలను నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా స్థానిక శివాజీ చౌక్ నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో విజయరామారావు మాట్లాడారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, సుభాష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

చిల్పూరు: కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై నిరసిస్తూ బీజేపీ నాయకులు మండల కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ మాట్లాడారు. శ్రీనివాస్, దిలీప్‌పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరామారావు

ఏడాదిలో అభివృద్ధి శూన్యం

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి చేసింది ఏమీ లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనపై కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. డొంగరి మహేందర్, పూసాల శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఎన్పీడీసీఎల్ ఏఈ శివకుమార్ అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో బుధవారం విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను గుర్తించి మిడిల్ స్తంభాలు వేయించడం, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తును పెంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. లైన్ ఇన్స్పెక్టర్ కొమురయ్య, లైన్‌మన్ సాయిబాబు, ఏఎల్‌ఎం సురేందర్, ప్రణయ్, రైతులు లక్ష్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

కొడకండ్ల: గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారని, వారి సంక్షేమాన్ని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌రావు, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ ఆరోపించారు. బుధవారం మండలంలోని సంక్షేమ వసతి గృహాలను బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసున్నారు. పేరం రాము, అభిమన్‌గాంధీ, ప్రభాకర్, జ్యోతి, సతీష్‌గౌడ్, రాజు, బాబర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల గోడలకు పోస్టర్లను అంటించి మాట్లాడారు. ప్రతాప్‌రెడ్డి, మధుప్రసాద్, ఉపేందర్‌రెడ్డి, నరేందర్, వేణు ఉన్నారు.

ముగింపురోజు నిరాహార దీక్ష

చిల్పూరు: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇనుగాల ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొంరెల్లి అన్నారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు నాడు నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు.

కేంద్రానికి లేఖ రాయాలి

జనగామ రూరల్: కరెన్సీపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటో ముద్రించేందుకు అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ పంపించాలని కరెన్సీపై ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరసురామ్ కోరారు. ఈ మేరకు బుధవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్కకు వినతి పత్రం అందజేశారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

తరిగొప్పుల: తరిగొప్పుల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఎస్సైగా విధులు నిర్వర్తించిన ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, మండల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి

జఫర్‌గఢ్: తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టడంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లి (జి)లో జీపీ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి హరీశ్‌కు అందజేశారు.

కరాటేతో ఆత్మరక్షణ

బచ్చన్నపేట: విద్యార్థులు కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని మండలంలోని కేసిరెడ్డి పల్లి సెకండరీ పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు కరాటేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు కరాటేను నేర్చుకోవాలన్నారు.

బెల్ట్ షాపులను మూసి వేయాలి

రఘునాథపల్లి: పేదల బతుకులు బుగ్గిపాలు చేస్తున్న బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద బెల్ట్‌షాపులు నియంత్రించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆయన పార్టీ నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కదారి ఐలయ్య, శాగ సాంబరాజు, ఎల్లయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గాంధీ విగ్రహానికి వినతి

పాలకుర్తి టౌన్: నియోజవర్గంలో బెల్ట్‌షాపులు తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేశ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

రోశయ్య వర్ధంతి సభకు తరలిన ఆర్యవైశ్యులు



జనగామ రూరల్/జఫర్‌గఢ్: హైదరాబాద్‌లోని హైటెక్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి మహాసభకు జిల్లాలోని ఆర్యవైశ్య సంఘం నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ముందుగా ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

లింగాలఘణపురం: పాఠశాలల్లో విద్యార్థుల కోసం లయన్స్‌క్లబ్ ఆఫ్ సూర్య అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుట్టు మిషన్లు, ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ రిజినల్ చైర్‌పర్సన్ చందుపట్ల రవీందర్‌రెడ్డి, హెచ్‌ఎంలు నర్సింహులు, పీఎస్ హెచ్‌ఎం జయలత, క్లబ్ అధ్యక్షుడు నల్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శి సతీష్, రవినాయక్ పాల్గొన్నారు.

సీఎం నుంచి నియామక పత్రం అందుకున్న రఘునాథపల్లి వాసి

రఘునాథపల్లి: సింగరేణి పర్సనల్ మేనేజర్‌గా ఎంపికైన మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ఉదయ్‌కుమార్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ అందుకున్నాడు. పెద్దపల్లిలో జరిగిన యువ వికాసం సభలో ఉదయ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నర్మెట: మండలకేంద్రానికి చెందిన గాదెర అరుణ్ (36), బండ ఎల్లేష్ (42), నిమ్మకంటి భిక్షపతి (54), గాగిల్లాపురం సిద్దులు (67) అనారోగ్యం ఇటీవల మృతిచెందారు. కాగా, బీఆర్‌ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాలను బుధవారం పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. చింతకింది సురేష్, ఆమెడపు కమలాకర్‌రెడ్డి, నక్కల రవి, ఎండీ గౌస్, బెడదం సుధాకర్, ఆమెడపు కిరణ్ కుమారరెడ్డి, ముక్కెర మహేందర్ తదితరులు ఉన్నారు.

వాహనాల దారి మళ్లింపు

జనగామ రూరల్: పట్టణం నుంచి పెంబర్తి వరకు నేషనల్ హైవే సంబంధించిన రోడ్డు పనులు జరుగుతున్నందున వాహనాల దారి మళ్లిస్తున్నట్లు పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు క్లౌం రోడ్డు వైపు వెళ్లాలని, లేదా నెల్లుట్ల మీదుగా హైవేకు చేరుకోవాని పేర్కొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

జనగామ రూరల్: నేడు(గురువారం) కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగుప్రకాశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వీవర్స్‌కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాకు మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, శాఖ కార్యదర్శి మచ్చ వరలక్ష్మి, రాపోలు రజిత మాదాసి సుధాకర్, లక్ష్మి, అండాలు యాదమ్మ, అంజమ్మ, దేవి, పాల్గొన్నారు.

బాధితుడిని ఆదుకోవాలి

బచ్చన్నపేట: బండనాగారంలో బూసరాజు ప్రభాకర్ ఇళ్లు ప్రమాదవశాత్తు కూలిపోయిందని, బాధితుడిని ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇజ్జగిరి రాములు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన కూలిన ఇంటిని పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లలో ప్రభాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

ర్యాంపు ఏర్పాటు

జనగామ రూరల్: దివ్యాంగులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ బస్టాండ్‌లో యుద్ధ ప్రాతిపదికన అధికారులు ర్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గోపా పటిష్టతకు కృషి చేయాలి

లింగాలఘణపురం: జిల్లాలో గోపా పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకపోతుల అంజనేయులు కోరారు. బుధవారం మండలంలో గోపా మండల అధ్యక్షుడు మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వాన్ని పెంచాలన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా అంబాల వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా మందపురం ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా సదానందం, రమేష్, కార్యదర్శులుగా యాదగిరి, సోమనర్సయ్య, సభ్యులుగా యాకస్వామి, నర్సింహరాజులను ఎన్నుకున్నారు.

బీఈడీ కళాశాలకు దారి కొనసాగించండి

జనగామ రూరల్: యశ్వంతాపూర్‌లోని ముస్లిం మైనారిటీ బీఈడీ కళాశాలకు ఉన్న 40 ఫీట్ల రహదారిని కొనసాగించాలని కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జమాల్ షరీఫ్ కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఏఓ మన్సూరీకి వినతిపత్రం అందజేశారు. యూసుఫ్ హుస్సేన్, మెహబూబ్ షరీఫ్, అబ్బాస్, అహ్మద్, రిజ్వాన్, నిసార్, ఆబిద్, శాకిర్, సల్మాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, గ్రంథాలయ చైర్మన్‌కు శుభాకాంక్షలు

రఘునాథపల్లి: రాష్ట్ర ఐకేపీ వీఓఏల యూనియన్ జేఏసీ అధ్యక్షురాలు మినుముల పద్మావతి–యాదవరెడ్డి దంపతులు బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబులను మర్యాద పూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో కడియం, రాంబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఐకేపీ వీఓఏల సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కె. మల్లేశ్ (S.R) : 9849921793 (జనగామ)
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
ఎల్. అనిల్ (S.R) : 8074977328 (స్టే॥ ఘన్‌పూర్)